క్లుప్తంగా

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం


శ్రీకృష్ణుడిని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని మద్దన్న గారిపల్లి గ్రామంలో శుక్రవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో అధ్యక్షులు, సభ్యులు నరసింహారెడ్డి, నరహరి దామోదర్‌రెడ్డి, వెంకటయ్య, వరుణ్‌కుమార్, గోపీనాథ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాస్యతా దినోత్సవం


గాండ్లపెంట: మాట్లాడుతున్న ఏటీఎల్ కృష్ణ

గాండ్లపెంట: ప్రతి ఒక్కరూ వందశాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయాలని ఆర్డీటీ ఏటీఎల్ కృష్ణ తెలిపారు. స్థానిక ఆర్డీటీ ఏరియా కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఆర్డీటీ కూడా బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునేలా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీటీ సంఘం పాఠశాలలు ప్రారంభించిందన్నారు. ఆర్డీటీ పాఠశాలల్లో సీబీటీలు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ నాగేంద్ర, ఆర్డీటీ సిబ్బంది సిఓ, సిబిటిలు పాల్గొన్నారు.

తలుపుల: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్డీటీ ఏటీఎల్ లక్ష్మన్న ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అక్షరాస్యత పెంచేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శివశంకర్ నాయక్, ఎస్ఐ మగ్బుల్ బాషా పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ రుక్మిణి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న వెన్నముద్దల వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణ రుక్మిణికి కల్యాణం జరిపించారు. ఈ కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శేషసాయి, తీర్థాల వెంకటరమణ, సుమంత్‌కుమార్, సత్యనారాయణ రావు, రామారావు, లక్ష్మీనారాయణ, దేవతా నాగరాజు సమక్షంలో కల్యాణం నిర్వహించారు.

అవయవ దానంపై అవగాహన

ధర్మవరం అర్బన్: విద్యార్థులు అవయవదానానికి ముందుకు రావాలని అమ్మ బాడీ ఆర్గాన్ ఐ డొనేషన్ ఆర్గనైజేషన్ ప్రమోటర్స్ ఫౌండర్ గంజి ఈశ్వర్ లింగం, చీఫ్ అడ్వయిజర్ సుబ్బరాజు సూచించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో నేత్రదానం, అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అవయవ దానం, నేత్రదానంతో మరొకరికి ప్రాణం పోయవచ్చని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవయవ దానం, నేత్రదానాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఫణీంద్ర, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్, అప్తాలమిక్ అసిస్టెంట్ సికిందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుబేర లక్ష్మీ వ్రతం


వ్రతం ఆచరిస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలతో కుబేర లక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను అర్చకుడు రాజేష్ వివిధ రకాల పూలు, తులసిమాలలు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కుబేర లక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీష్, కార్యదర్శి జింకా రాజేంద్రప్రసాద్, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించండి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి


పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారిగా ఉండి సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 34వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సాంకేతిక తప్పిదాల కారణంగా సామాజిక పింఛన్లు, ఇంటి స్థలం తదితర పథకాలు అందలేదని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. అలానే మరికొంత మంది వార్డులో 5 రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. 2 రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేలు అందిస్తూ ధర్మవరంలో అత్యధిక సంఖ్యాకులైన చేనేత కార్మికులకు చేయూత అందిస్తున్నారన్నారు. అంతేకాక రాష్ట్రంలో చేనేతలకు ఇంటి నిర్మాణంతో పాటు మగ్గం షెడ్డుకు అనుకూలంగా 1.50 సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు హౌసింగ్ సౌకర్యం కల్పించడం జరుగుతోందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేశామన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి.. పేద ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. పథకాలను పారదర్శకంగా అందించాలని, ఎక్కడైన చిన్నపాటి అవినీతి ఆరోపణ వస్తే ఉపేక్షించేది లేదని సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మెన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్ బాలం ఓబుళమ్మ, వార్డు ఇన్‌చార్జ్ బాలం గోపాల్, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, 40 వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం 'వైఎస్సార్ బీమా'

ధర్మవరం: పేద ప్రజలకు వైఎస్సార్ బీమా పథకం వరంగా మారిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసంలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన గంటా మల్లి కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4.90 లక్షల పరిహారం చెక్కును మృతుడి భార్య గంటా రామలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్నూరు కాలనీకి చెందిన గంటా మల్లి జూన్ నెలలో ప్రమాదవశాత్తూ చెరువులో కాలు జారిపడి మృతి చెందాడన్నారు. ఘటన జరిగిన రోజే అంత్యక్రియలకు రూ.10 వేల సాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పట్టణ సచివాలయాల కన్వీనర్ మాసపల్లి సాయికుమార్, జెన్నే సురేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


ధర్మవరం: బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

పింఛన్లతో పేదలకు భరోసా


పింఛన్లు పొందిన లబ్ధిదారులతో జెడ్పీటీసీ కోటి సుధ

బత్తలపల్లి: పింఛన్లతో పేదలకు భరోసా లభిస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బత్తలపల్లి-1, బత్తలపల్లి-2 గ్రామ సచివాలయాల్లో నూతనంగా మంజూరైన 32 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేసిందన్నారు. అర్హతే ప్రామాణికంగా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సిఫార్సులతో పింఛన్లు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం అర్హత ఉంటే పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ వలంటీర్ల ద్వారా పింఛన్లు అందిస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు నగదు, పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అశోక్‌కుమార్, వేల్ఫేర్ అసిస్టెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, మహిళా కానిస్టేబుల్ నాగమణి, ఏఎన్ఎం కవిత తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

ముదిగుబ్బ: మండల వ్యాప్తంగా నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం ఆయా పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 448 పింఛన్లు కొత్తగా మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా జీఆర్ రామ్మోహన్


ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న జీఆర్ రామ్మోహన్

ధర్మవరం రూరల్: శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శిగా జీఆర్ రామ్మోహన్‌ను ఎంపిక చేశారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

చికిత్స పొందుతూ వర్క్‌ఇన్‌స్పెక్టర్ మృతి

కనగానపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర (38) శుక్రవారం మృతి చెందారు. వివరాలు.. మద్దెలచెరువుకు చెందిన రాజేంద్ర కంబదూరు మండలంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం విధులు ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన అయన్ను అనంతపురంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

తలుపుల: మండలంలోని బట్రేపల్లి రోడ్డులో గల డిప్పులచేలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ రూల్స్‌పై ఆటో, జీపు, స్కూల్ బస్సు డ్రైవర్లకు శుక్రవారం ఎస్ఐ మగ్బుల్‌బాషా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ వెంకట్రామిరెడ్డి, ఈశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

గాండ్లపెంట: వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులు, ఆటోల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులను పాఠశాలలకు తీసుకోచ్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

నల్లచెరువు: రోడ్డు నిబంధనలు పాటిస్తే వాహనదారులు సురక్షితంగా గమ్యాలకు చేరుకోవచ్చని ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని తాటిచర్ల బ్రదర్స్ మైదానంలో శుక్రవారం ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు.

స్టాలిన్ దిష్టిబొమ్మ దహనం

అమడగూరు: తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ హిందూధర్మంపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఓడీచెరువులోని అంబేడ్కర్ సర్కిల్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్టాలిన్ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే దేశ వ్యాప్తంగా నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూపరిషత్, బజరంగదళ్, వినాయక సంఘాల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దంపతులు


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి దుద్దుకుంట అపర్ణరెడ్డి

నల్లమాడ: మండలంలోని నల్లశింగయ్యగారిపల్లిలోని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, దుద్దుకుంట అపర్ణరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న ఆరు మండలాల మహిళలకు ఎమ్మెల్యే దంపతులు చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

శుభకార్యం

నల్లమాడ: మండలంలోని గోపేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ముక్తాపురం రమణారెడ్డి, సాంబశివారెడ్డి గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు.

రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి


రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ తిప్పేనాయక్

చెన్నేకొత్తపల్లి: రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ధర్మవరం ఆర్‌డీఓ తిప్పేనాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలో రీసర్వే జరుగుతున్న న్యామద్దల, నాగసముద్రం, గ్రామాలను తహసీల్దార్ షాబుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం న్యామద్దల గ్రామంలోని ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు నాగేంద్ర, నీరజ, సర్వేయర్ సంతోష్ లక్ష్మి పాల్గొన్నారు.

బత్తలపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వే ద్వారా ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదని తహసీల్దార్ యుగేశ్వరి దేవి అన్నారు. శుక్రవారం బత్తలపల్లిలో ఆమె భూ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రీ సర్వే జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరి భూమి సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రైవేట్, బహిరంగ స్థలాలను గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే పూర్తయ్యాక క్యూఆర్ కోడ్‌తో భూహక్కు పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించి భూ సర్వే చేయించుకోవాలని సూచించారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ప్రతాప్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


తొట్టెలోని నీటిని పారబోయిస్తున్న వైద్య సిబ్బంది

తాడిమర్రి: దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీహెచ్ఈఓ నారాయణమ్మ సూచించారు. శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలసి పారిశుధ్య చర్యలు చేపట్టారు. తాడిమర్రిలో ఏఎన్ఎం కోమల, ఆశా కార్యకర్తలు నిర్వహించిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని ఎంపీహెచ్ఈఓ నారాయణమ్మ తనిఖీ చేశారు. వీధుల్లో తిరుగుతూ పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురుగునీటి గుంతల్లో వేస్టాయిల్ ఉండలు వేయించారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ నీటి తొట్టెల్లో ఉన్న నీటిని పారబోయించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ లక్ష్మీదేవి, ఆశా కార్యకర్తలు నరసమ్మ, ధనమ్మ, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఉప సర్పంచ్ ఎంపిక


ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న నాయకులు

అమడగూరు: అమడగూరు పంచాయతీ ఉప సర్పంచ్‌గా అక్కమ్మగారి మంజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో ఉప సర్పంచ్‌గా నవీన్ ఉండేవారు. అయితే గత సర్పంచ్ ఎన్నికల సమయంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్ల చొప్పున ఇద్దరికి ఉప సర్పంచ్ ఇవ్వాల్సి ఉంది. ఇందులో భాగంగా మొదటి రెండున్నరేళ్లు నవీన్ పదవిలో కొనసాగారు. ఇటీవల నవీన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో పంచాయతీ 7వ వార్డు మెంబర్‌గా ఉన్న మంజులకు ఉప సర్పంచ్‌గా ఎంపిక చేశారు. కాగా పంచాయతీ నాయకులు, కార్యకర్తలు నల్లశింగయ్యగారిపల్లిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, శివశంకర్‌రెడ్డి, హరినాథరెడ్డి, సర్పంచ్ షబ్బీర్, రంగారెడ్డి, రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

ఎన్పీకుంట: మండల పరిధిలోని గౌకనపేట గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటరమణ గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కదిరి ఏరియా ఆసుపత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటరమణ మృతదేహానికి నివాళులు అర్పించారు. తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజులు రెడ్డి, ఉపసర్పంచ్ హిదాయతుల్లా పాల్గొన్నారు.

ఆర్‌సీపీ నాయకులపై చర్యలు తీసుకోండి

కదిరి టౌన్: రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఆర్ కాలనీ (రవీంద్రారెడ్డి)కాలనీ మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేపట్టారు. ఆర్డీఓ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. వీవర్స్ కాలనీ సమీపంలోని సర్వే నంబర్ 83లో ఇందిరమ్మ పక్క గృహాలకు రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నాయకులు నాగన్న, అరుణ్ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. స్థలాలు ఖాళీ చేయాలని వేధిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో పద్మావతి, లక్ష్మీదేవి, నాగేంద్రమ్మ, భాస్కరమ్మ, సుగుణ, లక్ష్మీనరసమ్మ, మహబూబీ, రత్నమ్మ, శ్యామల, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ప్రభుత్వం శ్రద్ధ


మాట్లాడుతున్న సీడీపీఓ గంగరత్నమ్మ

నల్లచెరువు: అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సీడీపీఓ గంగరత్నమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్లచెరువు, తనకల్లు, గాండ్లపెంట మండలాలకు సంబంధించిన ఐసీడీఎస్ అధికారులు, వైద్యాధికారులతో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు వినియోగించుకోవాలన్నారు. ఆకుకూరలు రోజూ తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగించాలని సూచించారు. 108 సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రఫీ మున్నీసా, లక్ష్మీదేవి, జయమ్మ, పద్మావతి, సీహెచ్ఓ రామచంద్రారెడ్డి, ఎంఈఓ-2 ఎస్.చెన్నకేశవ కుమార్, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


ఎన్పీకుంట: కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు


తాడిమర్రి: హోరాహోరీగా సాగుతున్న పోటీలు

ఎన్పీకుంట: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ గోపాల్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పీడీలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్బిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు శిరీషారెడ్డి, పీడీలు సందీప్, ప్రసాద్, అశ్వని, సుహాసిని పాల్గొన్నారు.

తాడిమర్రి: క్రీడలు శారీరక ధృఢత్వం పెంపొందుతుందని ఎంఈఓ-2 వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు గోవింద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం వెంకటాచలపతి అధ్యక్షతన మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చిన్నికృష్ణ, ఓబుల్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ మండల కో-ఆర్డినేటర్ శంకర్‌నాయక్, పీడీలు రమణ, రవీంద్రానాయక్, ఆది ప్రసాద్‌నాయక్, యశోద, సుజాత పాల్గొన్నారు.

తలుపుల: మండలంలోని గుండువారిపల్లి పూలవేణుగోపాల్‌రెడ్డి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథరెడ్డి, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ లష్కర్‌నాయక్, పీడీలు ప్రకాష్‌రెడ్డి, మహేశ్వరి, రమణానాయక్, జయలక్ష్మి, యోగా టీచర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, జగదీష్, పీడీలు నాగరాజు, చిన్నప్పయ్య, రమేష్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

12న మండల స్థాయి క్రీడా పోటీలు

అమడగూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12 వ తేదీన మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం విజయదేవరెడ్డి, పీడీ షబ్బీర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహించనున్న వివిధ క్రీడా పోటీల్లో పాఠశాలల విదార్థులు పాల్గొనాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ముందుగా పాఠశాలలో సంప్రదించాలన్నారు.

బోనాల ఊరేగింపు

రామగిరి: మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం జరుపుకున్నారు. రామగిరి, మంగాపురం, గరిమేకలపల్లి, గంతిమర్రి, కొండాపురం గ్రామాల్లో యాదవ సోదరులు శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని అలంకరించి, పూజలు చేశారు. రామగిరిలో మహిళలు బోనాలు నెత్తినపెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి శ్రీకృష్ణుడికి సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం శ్రీకృష్ణుడి చిత్ర పటాన్ని ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.